క్లుప్తంగా

ముగిసిన ఇంటర్న్‌షిప్



మెకానిక్ కోర్సు విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

డోన్ టౌన్:పదో తరగతిలో వృత్తి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా నిర్వహించిన ఇంటర్న్‌షిప్ తరగతులు పూర్తయినట్లు పాతపేట జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జ్‌హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం ముగింపు సందర్భంగా శిక్షణ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..10 రోజులుగా వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు పట్టణంలోని ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్, సాయి గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్,లక్ష్మీ ఆటో గ్యారేజ్, రేడియం స్టిక్కర్ సెంటర్లలో ఎలక్ట్రానిక్స్, ఐటీ, బైక్ మెకానిజమ్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల కో ఆర్డినేటర్ వంశీ, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

కోవెలకుంట్ల: నంద్యాల కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సోమవారం మద్యం దుకాణాల కేటాయింపునకు లాటరీ నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తఖీబాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 11 మద్యం దుకాణాలకు 150 దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో కోవెలకుంట్ల మండలంలోని ఐదు షాపులకు 77 దరఖాస్తులు, సంజామల మండలంలో నాలుగు షాపులకు 38, దొర్నిపాడు మండలంలో ఒక దుకాణానికి 17, ఉయ్యాలవాడలో ఒక షాపునకు 18 చొప్పున దరఖాస్తులు అందాయన్నారు. లక్కీడిప్‌లో దుకాణాలు దక్కించుకున్న వారు ఈ నెల 16వ తేదీ నుంచి మద్యం దుకాణాలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ ఉంటుందని వెల్లడించారు.

శనగ విత్తనాల కోసం ఎదురుచూపు

కొలిమిగుండ్ల: రబీ సీజన్‌లో ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పది రోజుల క్రితం ఆయా రైతు సేవా కేంద్రాల్లో విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు చెల్లించారు. ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలకు ఇప్పటికే గ్రామాల్లో రైతులు శనగ సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. విత్తనాల పంపిణీ ఆలస్యం కావడంతో భూమిలో పదును ఆరిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో 2900 క్వింటాళ్లకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం 500 క్వింటాళ్లు మాత్రమే మంజూరయ్యాయి. నందిపాడు, బి.ఉప్పలూరు, గొర్విమానుపల్లె, కమ్మవారిపల్లె గ్రామాల రైతులకు పంపిణీ చేయనున్నారు. మిగిలిన కోటా రెండుమూడు రోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

రాయలసీమ యాసలో బాలుగాని టాకీస్



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న చిత్ర యూనిట్

డోన్ టౌన్: రాయలసీమ యాసలో నిర్మించిన బాలుగాని టాకీస్ సినిమాకు మంచి స్పందన వస్తుండడం సంతోషంగా ఉందని దర్శకుడు విశ్వనాథ్ ప్రతాప్ అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక డీస్టూడియో డ్యాన్స్ అకాడమిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆహా సంస్థ నిర్మించిన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతోందని హర్షం వ్యక్తం చేశారు. రచయిత అశ్విని గౌతమ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్‌శంకర్, కొరియోగ్రాఫర్ రవి మాస్టర్, చిత్రంలో హీరో స్నేహితులుగా నటించిన శేఖర్‌చంద్ర, సురేష్‌బాబు పాల్గొన్నారు.



నందవరంలో చౌడేశ్వరిదేవి



బనగానపల్లె: రాజరాజేశ్వరిదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి



సంజామల: ఆకుమల్లలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బేతంచెర్ల: ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



విజయదుర్గగా వాసవీ మాత

అంబరాన్నంటిన దసరా సంబరాలు

- ముగిసిన శరన్నవరాత్రి వేడుకలు
- ఆలయాల్లో 9 రోజుల పాటు విశేష పూజలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు



కోవెలకుంట్ల: దుర్గమ్మ ఊరేగింపు



దోన్: పాతబస్టాండ్‌లో కొలువుదీరిన దుర్గాదేవిని దర్శించుకుంటున్న భక్తులు



బేతంచెర్ల: అమ్మవారిశాలలో గ్రామోత్సవం







కోవెలకుంట్ల: మారెమ్మ ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం, బేతంచెర్ల: శమీ చెట్టు వద్ద పూజలు, దోన్: జమ్మి చెట్టుకు ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

డోన్ టౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9 రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం దసరా, ఆదివారం కనుమ పండుగలను నిర్వహించుకున్నారు. శనివారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. పెద్దలకు నూతన వస్త్రాలు, పిండి వంటలతో సాంబ్రాని వేసి పితృదేవలను శాంతపరిచారు. సాయంత్రం జమ్మిచెట్టుకు పూజలు చేశారు. డోన్ పాతబస్టాండ్ ముక్తేశ్వర ఆలయం, గాయత్రీ పీఠంలోని జెమ్మి చెట్టుకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారు శనివారం విజయదశమి సందర్భంగా చౌడేశ్వరిదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అలాగే కొండపేటలోని వాసవీకన్యకా పరమేశ్వరిదేవి, అయ్యప్పస్వామి ఆలయంలోని గాయత్రీదేవి రాజరాజేశ్వరిదేవిగా పూజలందుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంట్లో ఆయన సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు ఓబులరెడ్డి, కోడలు మేధాశ్రీరెడ్డి దుర్గామాతకు పూజలు చేశారు.

కోవెలకుంట్ల: విజయదశమి వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శనివారం వాసవాంబదేవిగా అలంకరించి పూజలు చేశారు. అదే రోజు రాత్రి గ్రామోత్సవం, తొట్టిమెరువని కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్యులు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. అమ్మవారు వెండిరథంపై పురవీధుల్లో విహరించారు. అనంతరం ఆలయంలో అమ్మవారి తులాభారం, ఆర్యవైశ్య సమారాధన, పాన్పుసేవ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అంకాలమ్మ చౌరస్తా, సరస్వతీనగర్‌లో వెలసిన మారెమ్మ, ప్రసన్నభారతీమాత రాజరాజేశ్వరీదేవిగా పూజలందుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కాళీమాత, దుర్గమ్మ వేషధారణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సంజామల: సంజామల, ఆకుమల్ల తదితర గ్రామాల్లో ఆదివారం గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులకు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, పుట్ట పెద్దమ్మ, వీరభద్రస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరిలో కార్మికులు, దుర్గాదేవికి పూజలు చేశారు. అలాగే అమ్మవారిశాలలో వెలసిన వాసవీమాత శనివారం విజయదుర్గ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు.

ప్యాపిలి: విజయదశమి వేడుకలను శనివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కనకదుర్గ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. స్థానిక జమ్మికట్ట చుట్టూ వాహనాలను, ఎడ్ల బండ్లను ప్రదక్షిణ చేయించారు. వాహన యజమానులు తమ వాహనాలను పూలతో అలంకరించారు. రైతులు ఎడ్ల బండ్లు, ఎద్దులను పూలతో అలంకరించి ప్రధాన వీధుల మీదుగా పరుగులు తీయించారు.



బేతంచెర్ల: హనుమాన్ నగర్‌లో కళాకారులు ప్రదర్శించిన అమ్మవారి శక్తి రూపాలు



బేతంచెర్లలో కోలాటాల నడుమ దుర్గామాత ఊరేగింపు

కనుల పండువగా గ్రామోత్సవం

డోన్ టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కన్యకాపరమేశ్వరిదేవిని తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. ఆదివారం గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డోన్ పట్టణ వీధుల మీదుగా అమ్మవారి ఊరేగింపు సాగింది. ఆర్యవైశ్య మహిళలు కోలాటాలు, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. వివిధ వేషాధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు.

నేడు నిమజ్జనం

పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు సోమవారం నిమజ్జనం చేయనున్నారు. ఉడుములపాడు, వెంకటాపురం చెరువుల వద్ద ఏర్పాట్లను పూర్తి చేశారు.

దుర్గామాత నిమజ్జన వేడుకలు

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్‌నగర్, జంగాలపేట, శ్రీనగర్, కొత్తపేట, వడ్డేపేట కాలనీల్లో 8 చోట్ల దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. బేతంచెర్లతో పాటు సిమెంట్‌నగర్, సీతారామాపురం, ఆర్ఎస్ రంగాపురం గ్రామాల్లో ఆదివారం నిమజ్జన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్క భజనలు, దుర్గామాత, కాళికామాత, శివుడు వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ దుర్గామాత విగ్రహాలను పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్ బాబు బందోబస్త్ ఏర్పాటు చేశారు.



బేతంచెర్ల: రంగాపురంలో ఎల్లమ్మ తల్లి ఊరేగింపు









దోన్: ఆర్యవైశ్య మహిళల కోలాటాలు, కోవెలకుంట్ల: కాళికామాత, దుర్గమ్మ వేషధారణలో కళాకారులు, దోన్: వివిధ వేషధారణలో కళాకారులు, దోన్: అమ్మవారి గ్రామోత్సవం

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

కోవెలకుంట్ల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనం ద్వారా ప్రపంచంలో జరిగే అనేక విషయాలు తెలుసుకోవచ్చని ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని శనివారం మండలంలోని వల్లంపాడు గ్రామంలో భారత్ గ్రంథాలయం పేరుతో పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాల్లో ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు పుస్తక నిక్షిప్త కేంద్రాల్లో లభించే పుస్తకాలను సద్వినియోగం చేసుకుని జ్ఞాన సముపార్జన పొందాలని సూచించారు. కోవెలకుంట్లకు చెందిన ప్రకృతి పీఠం ఆధ్వర్యంలో వల్లంపాడు పుస్తక నిక్షిప్త కేంద్రానికి 150 పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గార్లపాటి జగదీశ్వరరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, పెద్దరామిరెడ్డి పాల్గొన్నారు.



పుస్తక నిక్షిప్తకేంద్రాన్ని, ప్రారంభిస్తున్న పల్లె నరసింహారెడ్డి

పౌష్టికాహారం పంపిణీ

డోన్ టౌన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలోని బాలింతలు, రోగులకు దాతలు బాబ్జి, చిన్న సహకారంతో ఆదివారం రొట్టెలు, పప్పు, గుడ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రార్థన మందిరం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై గోవిందుడి వైభవం



గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: విజయదశమని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, భక్తుల నమో నరసింహా, గోవింద నామస్మరణల నడుమ స్వామివారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. అంతకు ముందు శమీ చెట్టుకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో చివరి రోజు అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు కాటసాని ఓబులరెడ్డి పరామర్శ



కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి పరామర్శించారు. ఆదివారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని సయ్యద్ హాజీహుస్సేన్ ఇంటికి వెళ్లి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

సంక్షిప్తం

వేడుకగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ



యాగంటిలో పల్లకీపై విహరిస్తున్న స్వామివారు

బనగానపల్లె: విజయదశమిని పురస్కరించుకుని శనివారం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలోని శమీ చెట్టుకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డీఆర్‌కే ప్రసాద్, మాలేశ్వరరెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, రాజశేఖర్, సంతోష్‌కుమార్‌రెడ్డి శివరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

డోన్ టౌన్: కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. వివరాలు.. కొండపేటకు చెందిన చాకలి రాము(55) లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. రెండు వారాల క్రితం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద బైక్‌పై వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలులోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఆరోగ్యం విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్, సభ్యులు మృతదేహానికి నివాళులర్పించారు. కాగా మృతునికి భార్య ధనలక్ష్మీ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సాయిబాబా మృతి తీరని లోటు

కోవెలకుంట్ల: మానవ హక్కుల నేత, రచయిత, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి ప్రజానీకానికి తీరని లోటు అని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షుడు కరుణాకరావు,ప్రధాన కార్యదర్శి జీఎల్ నరసింహుడు అన్నారు. ఆదివారం కోవెలకుంట్లలో విలేకరులతో మాట్లాడుతూ..ప్రొఫెసర్ సాయిబాబా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో ఒక రైతు కుటుంబంలో జన్మించి ఢిల్లీ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు.మావోయిస్టులతో సంబంధాలుఉన్నాయన్న నెపంతో అంగవైకల్యం ఉన్న ఆయన్ను సుమారు పదేళ్లపాటు జైలులో ఉంచారని తెలిపారు.సాయిబాబా పీడిత ప్రజల విముక్తి కోసం త న కలం, గళంతో పోరాటాలు చేశారని కొనియాడారు.

పదోన్నతి పొందిన డీఎస్పీకి సన్మానం

బనగానపల్లె రూరల్: అనంతపురం జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో సీఐగా పనిచేస్తూ ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీగా పదోన్నతి పొందిన ఎంఆర్ కృష్ణమోహన్ దంపతులను బనగానపల్లె నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు సన్మానించారు. ఆదివారం సాయంత్రం స్థానిక రామాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. నాయీబ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, గౌరవాధ్యక్షుడు పాతపాడు శ్రీరాములు, డాక్టర్ ఎంఆర్ శ్రీనివాసులు, కోశాధికారి శివయ్య, రామకృష్ణయ్య, మద్దిలేటి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్యాపిలి: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఈనెల 15, 16వ తేదీల్లో వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి రాజేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు.

వరి: వర్షం ఎక్కువైతే పొలాల్లో నీరు నిలువ ఉండకుండా బయటకు పంపాలి. పంటకు వేసే పైపాటి ఎరువులను వర్షాలు తగ్గిన తర్వాతనే వేసుకోవాలి.

వేరుశనగ: కోతలు పూర్తయిన వారు వేరుశనగ కాయలు తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలి. కోతకు సిద్ధంగా ఉంటే వర్షాలు తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలి.

పత్తి: పత్తి తీతలు చివరి దశలో ఉన్నందున చివరి తీతను వాయిదా వేసుకుని వర్షాలు తగ్గిన తర్వాత వేసుకోవాలి. ఇది వరకే పత్తి తీత చేసుకున్న వారు పత్తి వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పప్పుశనగ: వర్షాలు తగ్గిన తర్వాత పప్పు శనగ విత్తుకోవడం మంచిది. పప్పు శనగ విత్తనం వేసుకునేందుకు అక్టోబర్ 15వ తేదీ తర్వాత అనకూలంగా ఉంటుంది.

కంది: ప్రస్తుతం మొగ్గ నుంచి పూత దశలో ఉంటుంది కాబట్టి వర్షాలు ఎక్కువైతే పొలం గట్ల నుంచి నీటిని బయటకు విడుదల చేయాలి. ఇలా చేయకపోతే కంది పైరుకు వేరుకుళ్లు, ఎండు తెగులు ఆశించవచ్చు.

కల్యాణం..కమనీయం

బేతంచెర్ల: విజయదశమిని పురస్కరించుకుని మండల పరిధిలోని గూటుపల్లెలో వెలసిన పాలుట్ల రంగస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగస్వామిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించి డోలు వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. తాడిపత్రి మండలం ఎర్రగుంట్లపాలెంకు చెందిన జయరామిరెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

కొలిమిగుండ్ల: హిందూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి, అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం కనకాద్రిపల్లెలో సమరసత సేవా ఫౌండేషన్, అయ్యప్ప స్వామి భక్తులు, గ్రామపెద్దలు, ప్రజలు శోభాయాత్ర నిర్వహించారు. హిందూ మేలుకో.. సనాతన ధర్మాన్ని కాపాడుకో అనే నినాదాలు చేస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో అన్యమతాల ప్రచారం చేయకూడదని నిర్ణయించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక జమ్మలమడుగు చౌరస్తాలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆళ్లగడ్డ, నంద్యాల, జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.